## క్లుప్తంగా

### సీసీఆర్ కార్డుకు దరఖాస్తు చేసుకోండి

**వత్సవాయి:** కౌలురైతులందరూ కౌలురైతు గుర్తింపుకార్డు(సీసీఆర్) కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ కోరారు. సీసీఆర్ కార్డు దరఖాస్తు గడువు ఈనెల 30వతేదీతో ముగుస్తుందని వివరించారు. కౌలు గుర్తింపు కార్డు కోసం భూయాజమాని ఆధార్‌కార్డు, పాసుపుస్తకం, 1బీ జిరాక్స్ కాపీలు, కౌలురైతు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

### మున్సిపల్ అధికారులకు ఘనసత్కారం



**జగ్గయ్యపేటఅర్బన్:** స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ అధికారులను సభ్యులు ఘనంగా సత్కరించారు. కౌన్సిల్ సీసీ, సీనియర్ అసిస్టెంట్ ఎండీ తాజుద్దీన్‌బాబా నందిగామకు బదిలీ కావడంతో ఆయనను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. బదిలీపై పేటకు వచ్చిన నూతన కమిషనర్ డీటీవీ కృష్ణారావు, డీఈఈ శివకోటేశ్వరరావులను కూడా కౌన్సిలర్లు ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు హాఫీజున్నీసా, తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### అన్నదానానికి విరాళాలు

**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం బాపట్ల పట్టణానికి చెందిన దానబోయిన నాగదుర్గ వంశీ రూ.20,116ను ఆలయ సూపరింటెండెంట్ భాస్కర్, ధర్మకర్త పి.వెంకటరమణ చేతుల మీదుగా అందజేశారు. నందిగామకు చెందిన రాటకొండ రాధాకృష్ణ, కృష్ణకుమారి దంపతులు రూ.10,116, నందిగామ రైతుపేటకు చెందిన మన్నెం వెంకటకృష్ణ కిషోర్, రూ.5,116, చావా సోమిత్ అవాన్ రూ.5,116 విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

### 3న మండల పరిషత్ సమావేశం

**నందిగామరూరల్:** నందిగామ మండల పరిషత్ కార్యాలయంలో జూలై మూడోతేదీన ఎంపీపీ పెసరమల్లి రమాదేవి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

### బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి: ఎంఈవో



**పెనుగంచిప్రోలు:** ఐదేళ్లు నిండిన పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా బడిలో చేర్పించాలని ఎంఈవో డి.రవీంద్ర సూచించారు. బడిబయట పిల్లలను గుర్తించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా బడికి వెళ్లకుండా భిక్షాటన చేస్తున్న పిల్లలను కొందరిని బడిలో చేర్పించగా, అందులో కొందరు స్కూల్ నుంచి పారిపోయారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడిఈడు పిల్లలంతా బడిలో ఉండేలా ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఇకనుంచి ప్రతి శుక్రవారం ఆలయం వద్ద స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు గోపాల్, బాబు, సాంబ, సిబ్బంది పాల్గొన్నారు.

### దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** ఇస్లాం మత ఆచారం ప్రకారం నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా కొండపల్లి షాబూకారీ మసీదు, దర్గాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్లు కరిమికొండ శ్రీలక్ష్మి, చుట్టుకుదురు శ్రీనివాస్ పాల్గొన్నారు. మతగురువు మహ్మద్ అల్తాఫ్ రజా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఇస్లాం సంప్రదాయ బద్ధంగా వారిని సత్కరించారు. బక్రీద్ నెల ప్రారంభం సందర్భంగా మసీదులు, దర్గాల వద్ద పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని అల్తాఫ్‌రజా కోరారు. అనంతరం లంగర్‌ఖానాలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. పలువురు మత పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలు-ముండ్లపాడు రహదారి మధ్యలో ఏర్పడిన గోతులు



బైపాస్‌రోడ్డు రామాలయం వద్ద రహదారిపై గుంతల్లో చేరిన వర్షపు నీరు

# అధ్వాన రోడ్లతో తీవ్ర అవస్థలు



పెనుగంచిప్రోలు బైపాస్ రోడ్డు దుస్థితి

**పెనుగంచిప్రోలు:** మండలంలో పలు ప్రధాన రహదారులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా వర్షాలు పడుతుండటంతో గుంతల్లో నీరుచేరుతూ మరింత గోతులు ఏర్పడుతున్నాయి. పలుచోట్ల రోడ్డు కుంగిపోయి పెద్దపెద్ద గుంతలు పడటంతో వాహనచోదకులు, ప్రజలు అవస్థలుపడుతున్నారు. మండల కేంద్రం పెనుగంచిప్రోలు నుంచి ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వరకు రహదారి మొత్తం కుంగిపోయి పెద్ద గోతులు పడగా, పెనుగంచిప్రోలు నుంచి మక్కపేట వరకు నెలరోజుల కిందట పూడ్చిన గోతుల్లోని కంకర లేచిపోయింది. ముఖ్యంగా పెనుగంచిప్రోలు బైపాస్ రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలు పడటంతో వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహనచోదకులు ఆయా గుంతల విషయం తెలిక వాటిలో పడి గాయపడుతున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి పెనుగంచిప్రోలు మండలంలో ఆయా రోడ్ల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మరమ్మతులు చేసిన నెలరోజులకే దెబ్బతిన్న పెనుగంచిప్రోలు-మక్కపేట రోడ్డు

### నందిగామలో కుంగిన సిమెంటు రోడ్డు..

**నందిగామరూరల్:** నందిగామ పట్టణంలోని ఆర్‌సిఎం చర్చి ఎదురు, ఫైర్ స్టేషన్ పక్కనున్న సిమెంట్ రోడ్లు ధ్వంసమై పగుళ్లు ఏర్పడటంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారికి ఇరుపక్కల ఉన్న డ్రైన్ పూర్తిగా మూసుకుపోవడంతో మురుగు నీటి పారుదల సజావుగా సాగడం లేదు. వర్షాల సమయంలో ఈ రోడ్డుపై రెండుమూడు అడుగుల మేర నీరు నిలిచిపోతుండటంతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సిమెంట్ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ధ్వంసమైన ఆర్‌సీఎం చర్చి ఎదురు సిమెంట్‌రోడ్డు

## డీఎస్పీపై చర్యలు కోరుతూ న్యాయవాదుల నిరసన



నందిగామలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

**నందిగామరూరల్:** న్యాయవాదులపై పోలీసులు దాడులకు పాల్పడటం బాధాకరమని నందిగామ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వరదబోయిన విజయకుమార్ అన్నారు. న్యాయవాది శ్యామ్‌కుమార్‌పై మచిలీపట్నం డీఎస్పీ దాడి చేయటాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి న్యాయస్థాన సముదాయంలో వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నా, ప్రభుత్వాలు కనీస చర్యలు తీసుకోకపోతుండటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి అడ్వకేట్ ప్రొటెక్ట్ యాక్ట్ బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన పోలీసు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు అద్దంకి మణిబాబు, కన్నెకంటి జీవరత్నం, యర్రంరెడ్డి బాబురావు, షేక్ సైదా, పెసరమల్లి సురేష్, ఎక్కిరాల హనుమంతరావు, ఉప్పులూరి డేవిడ్‌రాజు, చిరుమామిళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**జగ్గయ్యపేట పట్టణంలో..**

**జగ్గయ్యపేటఅర్బన్:** మచిలీపట్నం బార్ అసోసియేషన్ న్యాయవాది బి.శ్యామ్‌కుమార్‌పై మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజు అమానుష చర్యలను ఖండిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు బద్దుల వెంకట్రామయ్య, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, జూనెబోయిన శ్రీనివాసరావు, దాసరి నాగేశ్వరరావు, బూడిద నరసింహారావు, ఎం.ఆంజనేయులు, బసవయ్య, కె.శ్రీనివాసరావు, పూల నాగరాజు, అంకమరాజు, ప్రతాపరెడ్డి, చిన్న గాంధీ, నరేష్, మహంతి, ఆలేటి కిషోర్, భిక్షమయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో కోర్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

## శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

**ఆందోళన చెందుతున్న రైతులు, కూలీలు**

**వీరులపాడు:** మండలంలోని తిమ్మాపురం గ్రామ సమీపంలోని మూలపాడు మేజర్ కాల్వపై నిర్మించిన బ్రిడ్జి పూర్తి శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా మారింది. రైతుల వ్యవసాయ భూములకు వెళ్లి వచ్చేందుకు వీలుగా సుమారు 20ఏళ్ల క్రితం ఈ బ్రిడ్జిని నిర్మించారు. ఈ మూలపాడు మేజర్ కాల్వపై నిర్మించిన ఈ బ్రిడ్జిపై నుంచే ఆయా గ్రామాల రైతుల తమ పంట పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అంతే కాకుండా ఆటోలు, ట్రాక్టర్‌లపై వ్యవసాయ కూలీలు, ఎరువులను సైతం తరలిస్తుంటారు. పంట కాలం పూర్తయిన తరువాత పంట ఉత్పత్తులను సైతం రైతులు ఈ బ్రిడ్జి మీదుగానే వాహనాల ద్వారా ఇళ్లకు చేరుస్తుంటారు. అయితే ప్రస్తుతం ఈ బ్రిడ్జి మరమ్మతులకు గురై పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళన చెందుతున్నారు. బ్రిడ్జికి మరమ్మతు పనులు నిర్వహించాలని, కుదరనిపక్షంలో నూతన బ్రిడ్జిని నిర్మించాలని ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన మూలపాడు మేజర్ కాల్వపై ఉన్న బ్రిడ్జి

## ఏటీఎస్ విధానాన్ని రద్దు చేయాలి: తన్నీరు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పక్కన నాయకులు

**జగ్గయ్యపేట అర్బన్:** ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని కుదేలు చేసేలా ఉన్న ఆటో ఫిట్‌నెస్ స్టేషన్స్(ఏటీఎస్) నూతన విధానాన్ని రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ఆటో ఫిట్‌నెస్ స్టేషన్స్(ఏటీఎస్) నూతన విధానంతో ట్రాన్స్‌పోర్టు రంగానికి తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

ఉదాహరణకు జగ్గయ్యపేటలో ఉన్న సుమారు పది వేల వాహనాలను నున్నలో ఉన్న ఆటో ఫిట్‌నెస్ స్టేషన్‌కు వెళ్లి తనిఖీ చేయించుకోవాలంటే వాహనదారులపై తీవ్రమైన ఆర్థికభారం పడుతుందని అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆటో, రైతులకు సంబంధించిన ట్రాక్టర్లు కూడా పల్లెటూర్ల నుంచి నున్న వెళ్లాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమన్నారు. మార్గమధ్యంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. ఆటో పరిమితి 60 కి.మీ వరకే ఉంటుందని, ఒక కిలోమీటర్ ఎక్కువ అయి ఏదైనా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ కంపెనీలు ఒక్క రూపాయి కూడా ఇవ్వవని గుర్తుచేశారు. అలాంటిది ఫిట్‌నెస్ కోసం సుమారు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయవాడ సమీపంలోని ర నున్నకు రమ్మనడం ఎంత వరకు సమంజసం ప్రశ్నించారు.

పెట్రోలు, డీజిల్ ధరలు విపరీతంగా పెంచడంతోపాటు సామాన్లపై ట్యాక్స్ రూపంలో ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. గ్రీన్ ట్యాక్స్‌ను రూ.3వేల నుంచి రూ 30 వేల వరకు పెంచడం తగదన్నారు. వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ స్టేషన్ల ఏర్పాటును ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులపై భారంపడకుండా ఉంటుందన్నారు. ఆదిశగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, నాయకులు పిడమర్తి ప్రభు, దర్శి గోపి, బజారు సాయి, జివ్వాజి నరసింహారావు, గూడపాటి శేషయ్య, పింగళి నరసింహారెడ్డి, బండి రాజు, బాణావత్ రాజు, పానుగంటి రాయుడు, ఆర్టీసీ ఖాదర్‌బాబు, గొట్టిపాళ్ల సురేష్, కొత్తపల్లి సురేష్, వేముల విజయ్ పాల్గొన్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత



**కంచికచర్ల:** అక్రమంగా రేషన్ బియ్యంను తరలించినా లేక నిల్వ ఉంచినా కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి హెచ్చరించారు. కంచికచర్లలోని గొట్టుముక్కల రోడ్డులో ఎస్.సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు వీఆర్వో మీసాల రమేష్‌కు సమాచారం అందడంతో శుక్రవారం రేషన్ అధికారులు తనిఖీలు నిర్వహించి, స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఎనిమిదిన్నర క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, పీడీఎస్ డీటీ సుమతికి అప్పగించినట్లు ఆర్ఐ తెలిపారు.

### రక్తదానం ప్రాణదానంతో సమానం



**ముక్త్యాల(జగ్గయ్యపేట):** రక్తదానం చేయడమంటే ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడినట్లేనని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. గ్రామంలోని కోహెన్స్ ఫార్మా కర్మాగారంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం చేయాలని యువతకు సూచించారు. అనంతరం కర్మాగారం సిబ్బంది, ప్రతినిధులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కర్మాగారం ప్రతినిధులు మురళి, సురేష్, సుబ్రహ్మణ్యం, బ్లడ్ బ్యాంకు ప్రతినిధి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఉచిత శిక్షణ

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఆ కళాశాల ఇంటర్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ టెక్కెం విజయబాబు తెలిపారు. అన్ని గ్రూపు సబ్జెక్ట్‌లకు శిక్షణ ఇస్తామన్నారు. ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.వివరాలకు సెల్‌నంబర్లు7995250842, 8106158174లలో సంప్రదించాలని కోరారు.

## క్షయ వ్యాధి నివారణపై అవగాహన



జగ్గయ్యపేటలో జీవీజే విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

**జగ్గయ్యపేటఅర్బన్:** పీఎం టీబీ ముక్తిభారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో టీబీ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వాస్పత్రిలోని పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు, పరీక్ష, చికిత్సా విధానం, జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం కలిగి ఉండటం, బరువును కోల్పోవడం, ఆకలి మందగించడం, దగ్గినపుడు ఉమ్మి ద్వారా కళ్లె పడటం, చాతిలో నొప్పి ఉండటం వంటి లక్షణాలు కలిగి ఉంటే వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి కళ్లె, ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం. పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు జి.నిక్సన్, టీబీ.సూపర్‌వైజర్ ఎస్.నాగరాజు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు రమణ, హుస్సేన్‌బీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అలరించిన సంగీతోత్సవాలు



త్యాగరాజ స్వామి కృతులను ఆలపిస్తున్న అమూల్య బృందం

**విజయవాడ కల్చరల్:** సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి 108, గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వర్ధంతి సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో శిష్యప్రశిష్య బృందం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆరాధాన సంగీతోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన రాయప్రోలు సుబ్రహ్మణ్యం కీబోర్డుపై, అమెరికాకు చెందిన సాయితేజ, హైదరాబాద్‌కు చెందిన డీవీఎల్ఎన్ శాస్త్రి, బీ సీతాలక్ష్మి, ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్, అమూల్య బృందం గాత్రంతోనూ వాగ్గేయకారుల కృతులను ఆలపించారు. ఈ సందర్భంగా సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్ మాట్లాడుతూ శనివారం అలంకార్ సెంటర్‌లోని పారుపల్లి రామకృష్ణయ్య విగ్రహం వద్ద ఉదయం తొమ్మిది గంటలకు పుష్పాంజలి, అలాగే ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు త్యాగరాజ స్వామి కృతుల గోష్టిగానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి, బీవీ దుర్గాభవాని, పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్ పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న పాలకులు

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ విమర్శ**



మాట్లాడుతున్న శ్రీనివాస్

**తిరువూరు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ తిరువూరు కమిటీ మహాసభ తిరువూరు షాదీఖానాలో శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రధానిగా మోదీ మూడోసారి ఎన్నికైన నాటి నుంచి కార్మికులకు, రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులకు నష్టం కలిగించే విధంగా కార్మికుల హక్కులు కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు దాసోహం చేస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కుల పరిరక్షణకై జూలై 9న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని శ్రీనివాస్ కోరారు. యూనియన్ నాయకులు బి. వెంకటేశ్వరరావు, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు. తిరువూరు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన అధ్యక్షులుగా చాపలమడుగు నాగరాజు, ఉపాధ్యక్షులుగా మారెపోగు నాగరాజు, విజయమ్మ, కార్యదర్శిగా మోదుగు సురేష్ ఎన్నికయ్యారు.

## ఘాట్‌రోడ్డులో మొబైల్ ఏటీఎం సేవలు



**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఘాట్ రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద శుక్రవారం నుంచి కెనరా బ్యాంక్ తన ఏటీఎం సేవలను ప్రారంభించింది. ఓం టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ ఏటీఎంను దుర్గగుడి ఈవో శీనానాయక్ శుక్రవారం ప్రారంభించారు. మొబైల్ ఏటీఎం కౌంటర్‌కు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఈవో రిబ్బన్ కట్ చేసి సేవలను ప్రారంభించారు. అంతకు ముందు దేవస్థానానికి విచ్చేసిన బ్యాంక్ అధికారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

**సద్వినియోగం చేసుకోవాలి..**

అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత రవాణా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో శీనానాయక్ సూచించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నడుపుతున్న ఉచిత బస్సులు, బ్యాటరీ వాహనాలు, వ్యాన్‌లను ఆలయ ఈవో శుక్రవారం తనిఖీ చేశారు.

## జీవాలకు నట్టల నివారణ మందులు



గండేపల్లి పశువైద్యశాలలో జీవాలకు నట్టల నివారణ మందులు వేస్తున్న ఏడీఏ వెంగళరావు

**గండేపల్లి(కంచికచర్ల):** మండలంలోని గండేపల్లి పశువైద్యశాలలో శుక్రవారం గ్రామంలోని గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేశారు. ఈసందర్భంగా పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు ఘంటా వెంగళరావు మాట్లాడుతూ నట్టల నివారణ ముందుల కారణంగా జీవాల్లో అంతర పరాన్నజీవులు చనిపోయి తీసుకున్న ఆహారం సక్రమంగా శరీరానికి అందుతుందన్నారు. తద్వారా మంచి ఎదుగుదల, ప్రత్యుత్పత్తికి పెరుగుతుందన్నారు. ప్రతి పశుపోషకులు తమ జీవాలకు నట్టల నివారణ మందులు వేయించాలని సూచించారు. పశువైద్యాధికారి నవీన్‌కుమార్ మాట్లాడుతూ కీసర, గండేపల్లి రెండు గ్రామాలకు చెందిన 1100 గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సోడగిరి సతీష్‌కుమార్, గొర్రెలు మేకల పెంపకందార్ల సొసైటీ అధ్యక్ష్యుడు జంగాల నాగేశ్వరరావు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ మోగులూరు ప్రియాంక, ఏహెచ్ఏ బి.మానస, మార్కపూడి గాంధీ, పశు వైద్య సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.